
# అరుంధతి




వడ్డెరచండీదాస్

కాంటీన్‌లో ఫలహారం కాఫీ, పుచ్చుకుని బయటికొచ్చి, టివోలీలో "ఎస్టర్‌డే టూడే, టుమారో" చూడటమూ, క్లబ్బుకెళ్ళి బిలియర్డ్స్ ఆడటమూ అనేది తెల్చుకోలేకపోతూండగా అరుంధతి గుర్తొచ్చింది. కారు లేదు. అది నెలకి పది పదిహేను రోజులు పుట్టింట్లో వుంటుంది (దాన్నిగరేజ్‌వాళ్ళదగ్గరనుంచే కొన్నాను.) ఐనా నాకెందుకో దానిమీద మమకారం. టాక్సీ పిలిచి బేగంపేటకని చెప్పి కూచున్నాను.

అరుంధతిని చూసిన మొదట్లో శిథిల శిల్పారామంలో శిథిలమవని భిక్షుకి విగ్రహం స్ఫురించేది.ఆ తరవాత తరవాత వృద్ధాప్యం తొందరపాటుగా ఆవరించిందేమోననే భావం స్ఫురించేలా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో మలిచిన శిల్పం రూపించేది. శిల్పశాస్త్రం అంగీకరించదేమోగానీ. చివరికి, మంచు శిల్పం స్థిరపడిపోయింది.

స్వచ్ఛ గ్రీష్మపు ఎండలోని రంతరం కరుగుతూ జాల్వారుతున్న మంచు శిల్పం, అరుంధతి.

యీ స్రవించటం, బహిరాకృతి నుంచి కాదు. వక జల, హృదయపు అంతరాంతరాలలో స్రవించి పెదవుల మీది చిరునవ్వు లోంచి జాల్వారుతుంది. మరో జల, మేథా వల్మీకంలో స్రవించి. నుదుటి మీదుగా భృకుటిలోంచి విడబారి కనురెప్పల లోంచి సెగలా యెగసిపోతుంది.

శిథిల మవకండా నీళ్ళలో జీవించే మైనం బొమ్మలా, యీ తెల్లని చల్లని మంచు బొమ్మ, నారింజ రంగు జ్వాల లాంటి తన స్రవ్యజ్వాలలో జీవిస్తున్నట్టనిపిస్తుంది. శాస్త్రం వొప్పుకోకపోవచ్చు: కాని యీ మంచు శిల్పం. తనచుట్టూ తాను స్రవించుకున్న సెగలో. ఆ సెగవల్లనే జీవించ గలుగుతున్నట్లనిపిస్తుంది నాకు.

ఎండా గాలీ వానా కలిసి సమష్టిగా, వెన్నెలసోసను గడ్డకట్టించి, చెక్కి, జీవం పోస్తే తయారైంది ఈ శిల్పం. అందరూ పేటికోసమో దేనికోసమో దేవులాడుతున్న వేళ, ఆదమరిచి నిద్రిస్తున్న నా హృదిలో అడుగిడిన ఈ శిల్పాన్ని తర్కం చిటుక్కున ఎగరగొట్టొచ్చుగాక. ఐతేనేం తర్కానికి హృదయమొక పద్మవ్యూహం.

టాక్సీ దిగి. మెట్లెక్కి పైకి వెళ్ళాను.

మంచం ప్రక్కగా పేము కుర్చీలో కూచుని వుంది.

ఒళ్ళో కన్నిటి పగడాలు పోసుకుని ఆకలవాంతో మరీచికాహారం గుచ్చుతున్నట్లనిపించింది.

నన్ను చూసి, పల్చగా, నిశ్శబ్దంగా నవ్వింది—రాత్రంతా వర్షంలో తడిసి ఉదయపు గాలికి కదులాడిన జూకామందారంలా అనిపించింది.

చదువుతున్న పేజీల మధ్యా చూపుడు వేలుంచి బొటనా మధ్య వేళ్ళతో పుస్తకం నొక్కిపట్టుకుని–

"కులాసా?" అంది.

"అది నే నడగాల్సిన ప్రశ్న." అని సన్నగా నవ్వాను, కుర్చీలో కూచుంటూ.

"యేం ఆరోగ్యం నీ వొక్కడి సొత్తు కాబోలు!"

"నా వొక్కడి సొత్తు యెంత కాదో నీ సొత్తు అంత కాదు."

"నిద్రమాత్రలు కనిపించకుండా పెట్టేసి వెళ్ళిన నిన్ను యేం చేసినా పాపం లేదు."

"నిజానికి ఆ మందుల అర తాళంచెవి నీ కివ్వదలిచినా వైద్యవృత్తి చట్టం వొప్పుకోదు. నిద్రమాత్రలు చెదపురుగుల్లాంటివి. నిద్ర, మానసికం, మనసు, దానంతటది నిద్రకున్ముఖం కావాలి. ప్రతిరోజూ మందులతో నిద్రపోవాలనుకోవటం — మంచం కింద బొగ్గుల కుంపటి పెట్టి పైన తడిబట్టతో వొళ్ళు తుడవటంలాంటిది. రాత్రి యెన్ని గంటలకి నిద్రపోయావు— కళ్ళలో రెండు కొత్త యెర్ర జీరలు సన్నటివి ఏర్పడినట్లున్నాయి?"

"అబ్బే, పన్నెండు లోపునే నిద్రపోతున్నాను. యీ మ్యథాహ్నం కూడా నిద్రపోయి వుందునేమోగానీ, యిదో, యీ బుచ్చిబాబు-యీయన నాటికల పుస్తకం చూస్తున్నాను. రావిశాస్త్రి అల్పజీవి, మామ్ సొతెసె స్టోరీసూ తెచ్చిపెట్టమన్నాను, మర్చిపోయినట్లున్నావు—"

"లేదు అరుంధతీ, కొనటం మర్చిపోలేదు.కొనియింట్లోవుంచాను. తీసుకు రావటం మర్చిపోయాను. నిజానికి, మర్చిపోలేదు. నేను రావటం నేరుగా యింటినుంచి కాదు.

"నయనతార యీ వారం ఆఖర్లోగా వస్తున్నట్టు రాసింది. ఆ చదువు ముగిసిందంటే, నా మనసు తేలికపడినట్లుంది."

తన కూతుర్ని నయనతార అని పిలుచుకుంటుంది. మాధవి అని పేరు పెట్టాడు లోకనాథం.

"నీ యిదికి అర్థంలేదు. మాధవి సౌశీల్యం తన అందానికి తీసిపోదు, ఐనా, ఆడపిల్ల, ఎప్పుడో అప్పుడు పెళ్ళి చేసుకుని మరో ఇంటికి వెళ్ళిపోవాల్సిందే కదా?

"లేదు రవీ, అలాంటి మూర్ఖపు స్వార్థం లేదు నాకు. జీవితాంతం నా దగ్గరే కట్టి పడేసుకోవాలని కాదు. పెళ్ళయేవరకే నా బాధ్యత."

"ఆ బాధ్యత పేరు. అనుక్షణం యెక్కడికి వెళ్ళిందీ, యేం చేస్తున్నదీ నువ్వు గమనిస్తూ వుండాలనుకోవటం మాట. అర క్షణంలో, జీవితం, అరపై పల్టీమలుపులు తిరగొచ్చు.'

"నా నయనతారని నే నెప్పుడూ కావాలని నొప్పించ లేదు."

మాధవి కోసమే జీవిస్తున్నట్లుగా అనిపించే నువ్వు, ఎందుకు నొప్పించాలనుకుంటావు గానీ- పంజరంలో చిలకలా అనిపించాక యెన్ని సౌఖ్యాలు సమకూర్చినా హాయిగా అనిపించదు."

'నేనలా అనుకుంటే రెండేళ్ళపాటు అంత దూరం వెళ్ళి వుండటానికి వొప్పుకుంటానా. చెప్పు'

"అనెవరన్నారు! పోనీ ఆ విషయం ఆఫీసునుంచి యింకా రాలేదా?"

"వొచ్చారు. యేదో సమావేశం వుందని వెంటనే వెళ్ళిపోయాడు." అని లేచి బల్ల మీది ద్రాక్ష పళ్ళేరం తెచ్చి నా కుర్చీ చేతి మీద పెట్టి, "తీసుకో" అంది.

రెండు పళ్ళు నోట్లో వేసుకుని. వొంగి దిన పత్రిక అందుకుని చూస్తున్నాను.

బెల్లు నొక్కి. గుండయ్య వొచ్చాక కాఫీ తీసుకురమ్మని చెప్పి, కుర్చీలో కూర్చుంది.

'రాజస్తాన్ రాష్ట్రంలో. యెవరో వో ప్రేమికుల జంట,హోటేలు గదిలో ఆత్మహత్య చేసుకున్నారట.' అన్నాను, పత్రికలోంచి తల పైకెత్తుతూ.

"పత్రికలో వార్త నిజం అనేవిటి!"

"యీ వార్త నిజం ఐనా కాకపోయినా అవాస్తవం కాదు. ఎందరో ప్రేమికుల ఆత్మహత్యలు చూస్తూనే వుంటాం. ఈ జంట వాళ్ళ వివాహానికి ఆస్కారం లేని కారణంగా మరో లోకంలో పెళ్ళి చేసుకునేందుకు విషం పుచ్చుకున్నారు. పక్కమీద ఒకరి చేతులమధ్య ఒకరు చనిపోయి వున్నారట. రకరకాల పట్టింపులూ కట్టు

బొట్లూ ఇలాంటి సంఘటనలకి కారణం అవుతున్నాయనిపిస్తుంది. కొన్ని ట్రైబల్ తెగలలో ఇలాంటి సంఘటనలు లేవనె చెప్పొచ్చు. మానసిక రగడ, నాగరికతః చిహ్నంగా చెప్పొచ్చు. ఉద్రేకాల నిండు మనిషిగా జీవిస్తారు వాళ్ళు. నాగరీక మానవుని మనసు ఓ పెద్ద పుట్టలాంటిది. ఎన్నో కలుకులు, అరలు, పొరలు, తెరలు, మరుగులు. అనాగరికుని మనసు శుభ్రమైన పలకలాంటిది. రాసిన నాలుగు అక్షరాలూ స్పష్టంగా విడిగా పొడిగా కనిపిస్తాయి. అనిపించినట్లుగా జీవిస్తారు. మనసును అడక త్తెరలో పెట్టి కత్తిరించటా లుండవు. అడవిలో విశృంఖలంగా పెరిగిన తీగలా సాగుతుంది మనసు. ఇష్టమొచ్చిన వాళ్ళను పెళ్ళాడేస్తారు. ఇష్టమొచ్చినట్లుగా వుండేస్తారు. తండ్రీ కూతురు, అన్నాచెల్లెలు, తల్లీ కొడుకూ— ఇలావావివరసల గోడలులేపనెత్తికృత్రిమం చేసుకోరు—

'వాళ్ళకి కూడా కొన్ని కొన్ని కట్టుబాట్లుంటాయని యేదో కథలో చదివాను.'

"ఆ రకం కట్టుబాట్లు వేరు. యీ నీతి గోడలు వేరు."

'నీతి నియమాలు లేకపోవటమూ సాధ్యంకాదు. తండ్రిని తన కూతురినే పెళ్ళిచేసుకోమంటే; యెంత ఘోరం, యెంత పాపం!'

"అది మనం అనుకోపటంలో వుంటుంది. కేవలం సెంటిమెంటు. తన మనమరాలి వయసుండే స్త్రీతో వక వృద్ధుడు సంసార జీవితం గడపగలుగుతున్నాడు. అదే తన మనమరాలు లేక కూతురు ఐతే? జీవశాస్త్ర రీత్యా విజాతి సంపర్కం తగనది కావొచ్చు. అక్క బిడ్డల్ని పెళ్ళాడటం, కొన్ని తెగల ముస్లింలలో పింతల్లి బిడ్డల్ని చేసుకోపటం లాంటివి చేస్తున్న నాగరిక మనిషి ఆ సూత్రాన్ని పాటిస్తున్నట్లు చెప్పటానికి వీల్లేదు."

నవ్వి, 'నీకూ పెళ్ళయి వో కూతురు వుండి వుంటే అప్పుడు తెలిసేది: పితృ వాత్సల్యం, మాతృ వాత్సల్యం లాంటి వాటిని అంత తేలికగా తీసిపారేసి అన్నింటినీ ఒకేగాట కట్టెయ్యలేకపోయేవాడివి.' అంది.

"అందుకు పెళ్ళి చేసుకుని బిడ్డల్ని కనక్కరలేదు. వివిధ దశలలో వివిధ మానవుల ప్రవర్తనని పరిశీలిస్తే అదంతా కేవలం సెంటిమెంటని యిట్టే అవగతం అవుతుంది.

గుండయ్య కాఫీ కప్పులు తీసుకొచ్చాడు. రెండు కప్పులూ తనే అందుకుని నాకో కప్పు అందిస్తూ—

'ఇప్పుడిదంతా మనకెందుకొచ్చిన గొడవ గానీ- వో విషయం చెప్పు. ప్రపంచం బాధామయం అని తెలిసీ, మనిషి యెందుకు జీవిస్తున్నట్లు?' అంది.

'అలా అనుకుని జీవిస్తే - యేదో ఆశ, యేదో సుదూరాన వున్నదనుకునే మిణుగురు మరింకేదో అస్పష్టభావం, జీవింపజేస్తుంది. ఐనా ప్రపంచం బాధామయం అనెందుకనుకోవాలి? బాధ వినా సుఖం లేదు; సుఖం వినా బాధలేదు. ఆ బాధ అనబడేది యెంత తియ్యనిదీ సుఖమయమైనదీ కాకపోతే మనిషి జీవించేందుకే నిరంతరం యత్నిస్తున్నాడంటావ్! ఇంట్లో పిల్లిపిల్ల చచ్చిపోతే నీకు బాధ. పూలమొక్క కొమ్మ విరిగితే బాధ. తెల్లని గోడమీద మరక పడితే బాధ, ఫంటమనిషి వేలు. కత్తిపీటకి రవంత కోసుకుంటే నీకు బాధ—

"కసాయి కొట్లో పనిచేసే నీకు అవన్నీ అతి స్వల్పం అనిపించొచ్చు."

"ఆ కసాయివాడే ప్రాణాలు రక్షిస్తున్నాడు. అది రుగ్మతని చంపేసే వధ్యశాల. హింసని చూసి భయపడేవ్యక్తి యెంతో హింస చేసివుండాలి. పాపం అని ఇదయ్యే వ్యక్తి యెంతో పాపంచేసి వుండి వుండాలి. నిటారుగా నిలబడి నిండుగా జీవించాలి! తను అనుకున్నట్టుగా- అది తప్పు కానీ, వొప్పు కానీ."

ఆమె కళ్ళలో నీళ్ళు. నా మనసు విలవిలలాడింది.

"మా డాక్టర్లని వెనకేసుకొచ్చి నిన్ను నొప్పించివుంటే క్షమించు అరుంధతీ" అని ముందుకు వంగి, ఆమె చేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను.

తొట్రుపడి, "అబ్బే లేదు రవీ, నీ మాటలు నన్ను నొప్పించలేదు." అని తన చేతులు విడిపించుకుని, కుడిచేతి చూపుడు వేలికొన కింది పెదవి మీద అన్చి, "యింత నిష్కల్మషమైన సహృదయుడివి, నీ జీవితం యేమిటా, యిలా వొంటరిగా వృధాగా సాగిపోవటం--అని. నీకు పెళ్ళి సంబంధాలు చూసిచూసి, నిన్ను వొప్పించలేక చివరికి విసిగిపోయారు మీ వాళ్ళు. ఆ అసంతృప్తి తీరకుండానే కన్నుమూశారు. ప్రతి వ్యక్తి యేదో లక్ష్యంతో జీవిస్తాడని అన్నావు. ఐనప్పుడు నీకూ వొక లక్ష్యం అవసరమే కదా—"

"నాకేం ... అరుంధతీ! నా జీవితం నిన్ను కలవరపెట్టటం—"

"నీ స్థితి నన్ను కలవరపెట్టలేదు. నన్ను కలవరపరిచింది మరో విషయం. నీ స్థితి నాకు బాధగా అనిపిస్తుంది."

"మరి నిన్ను కలవరపెట్టిందే విషయం?"

"ఏదో అసంగత అప్రస్తుత విషయం. మనకి సంబంధించని లోకంలో విషయాలు ఎన్నో మనని కలవరపెడుతూ వుంటయ్. అది బలహీనతే కావొచ్చు."

"నువ్వు సుఖంగా వుంటే నేనూ వున్నట్టే."

"నాకేం లోటు రవీ! నీ ఏకాకి జీవితం- ఎందుకన్నట్లు. ఏం సాధించేందుకు, ఏ ఆశయాలకోసం—"

"లోకంలో వున్న అనారోగ్యాన్ని నిర్మూలించాలనే ఆశయం వుందనీ, అదే నా ధ్యేయమనీ ఎందు కనుకోగూడదు! జీవితంలో రెండు జాములు గడిచిపోయిన నాకు ఈ ఆశయాల ప్రసక్తి వర్తించదేమో. ఐనా అందరూ మానవులే ఐనా ఎన్నో విభిన్న రీతులుగా జీవిస్తున్నారు" అని ప్రారంభించినవాణ్ణి, అనుకోకుండా మానవ స్వభావాలూ ప్రవర్తనల గురించి అరగంటసేపు మాట్లాడాక గానీ తెలిసి రాలేదు, అరుంధతిని ఖూనీ చేసినట్టు.

ఆమె సహనం నే నెరగనిది కాదు.

"నీ సహనాన్ని నే నింతగా దుర్వినియోగం చెయ్యటం క్షమించరాని విషయం" అన్నాను.

నా మనసులో ఏదో సంచలనంగా వుంది.

"యెన్నో విషయాలు యెంతో విపరంగా వోర్పుతో చెప్పే నీ ముందు నా సహనం యేపాటిది రవీ! నా జీవితంలో కాలేజీకి వెళ్ళి చదువుకొని లోటు తీర్చుతున్నావు నువ్వు. మరి మనమింక భోజనాలకి లేస్తే—

నా మనసెందుకో యెలాగో ఉంది ఏదో అస్పష్ట సంచలనం. అనీజీగా అనిపించింది.

"ఈ పూట సన్నొదిలే సెయ్యాలి."

అన్నాను.

"అదేమిటి! అంది ఆశ్చర్యంగా.

మరోసారి మరోసారి అన్నా కూడా— వో స్నేహితుడితో కలిసి భోజనం చేస్తానని మాట యిచ్చానని అబద్ధమాడి బయటికి వొచ్చేశాను.

రెండు ఫర్లాంగులు టప్పాడినట్లుగా నడిచాను. బస్టాపుదగ్గరికి వొచ్చేసరికి బస్సు

వొచ్చి ఆగింది. తొందరతొందరగా యెక్కేశారు అందరూ. బస్సు ఖాళీగానే వుంది. ఆర్టీసీ వాళ్ళకోసం యెక్కినట్లుగా యెక్కాను.

అరుంధతిని తొలిసారిగా కలుసుకున్న పదేళ్ళ వెనకటి సంజెవేళ నాకిప్పటికీ బాగా గుర్తు. అప్పటికి అరుంధతి వయసు ముప్ఫయ్ ఐదేళ్ళు; నాకు ముప్ఫయ్యేళ్ళు. ఆస్పత్రికొచ్చి తన పేరు ఫలానా తను ఫలానా అని పరిచయంచేసుకుని, వాళ్ళావిడ ప్రమాదస్థితిలో వుందనీ నన్ను వొచ్చి చూడమనీ దర్పంగా అడిగాడు లోకనాథం. నలభయ్యేళ్ళ వయసుంటుంది. నల్లని దుబ్బు జుట్టులో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు. బూడిదరంగు సూటు. కళ్ళజోడు. గోధుమరంగు వొళ్ళు. అదివరలో వకటి రెండు సార్లు ప్రొఫెసర్ అంజాదలీ దగ్గరికి వొచ్చినప్పుడు చూడటం జరిగింది. ఆ కేసు గురించి అంజాదలీ మాటల సందర్భంలో వోసారి నాతో అన్నట్లు చూచాయగా గుర్తు. అప్పట్లో నేను అసిస్టెంట్ ప్రొఫెసర్ని, నాకు ప్రైవేటు ప్రాక్టీసు అలవాటులేదని డ్యూటీలో వున్నాననీ అన్నాను. నిజానికి మొదటిది నిజమైనా రెండోది నిజం కాదు. యెన్నిసార్లో డ్యూటీలో వుండగా, యే సిస్టర్ గ్రేసియానో, కుట్టినో వొడుపుగా కుదిరితే చెక్కేసే వాణ్ణి. కాగా మరో అరగంటలో డ్యూటీ ఐపోతుంది. కానీ, కొత్తగా వొచ్చిన సిస్టర్ వకుళ మొదటి ఆట సినిమాకి వొచ్చేందుకు మొదటిసారిగా సిద్ధపడింది.

రావటానికి వీల్లేదు పొమ్మని చెప్పాను.

తనెప్పుడైనా అవసరం ఐన వేళకి లేకపోతే నన్ను తీసికెళ్ళమని అంజాదలీ అన్నాడనీ. డ్యూటీ విషయం తను చూస్తాననీ—వెంటనే ఆస్పత్రి సూపరెంటుకి ఫోను చేశాడు. యీయన జమాయింపేమిటని మహ చెడ్డ కోపం వొచ్చింది. అంతలో ఆరెంవో నుంచి నాకు ఫోనొచ్చింది. డ్యూటీ రిలీవర్ సిద్ధంగా వున్నాడనీ. నేను వెళ్ళొచ్చనీ. సరే, అని ఫోను పెట్టేసి, ఆ పెద్దమనిషిని తక్షణం బయటికి నడవమని అనాలనుకుంటూ వుండగా- నా ముందుకు రెండడుగులు వేసి చటుక్కున నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని, "ప్లీజ్ పదండి" అన్నాడు. మాటలో దర్పం; కళ్ళలో తడి. ఎందుకో తమాషాగా అనిపించి వెళ్ళాను.

బేగంపేట ప్రాంతంలో కొత్తగా కట్టి వుంటారనిపించే అధునాతనపు మేడ. చుట్టూ పుష్కలంగా ఖాళీస్థలం. పూలమొక్కలు, పచ్చిక- చుట్టూ ప్రహరీగోడ.

పరీక్ష చేశాను. రక్తపోటు కావొచ్చు. సెడేటివ్ ఇచ్చి ఆమె కేసి పరిశీలనగా చూశాను. పండనని భీష్మించుకుని, పూదిరకి కాసింత మెత్తగిలిన మావిడి కాయలా అనిపించింది. వొడిలిట్లనిపించే ప్రౌఢత్వం.

తన భార్యపేరు అరుంధతీదేవి అనీ, ఆంధ్రప్రదేశ్ ఐన దగ్గరనుంచి ఈ నగరంలో వుంటున్నట్లూ, వాళ్ళకో తొమ్మిదేళ్ళ కూతురనీ ప్రారంభించినవాడు మెల్లగా నావివరాలలోకి దిగి. అరగంటలో తేల్చిన విషయాలివి వాళ్ళావిణ్ణి ట్రీట్ చెయ్యడానికి తను తప్పితే తన అసిస్టెంటునయిన నేనని అంజాదలీ అభిప్రాయం వెలిబుచ్చాడని. అరుంధతీదేవి వైపునుంచి నేను వాళ్ళకి దూరపు బంధువుననీ, వరసకి ఆమె నాకు సోదరి అవుతుందని. ఆయన వాడిన పదం కారణంగా నాకు చచ్చేనవ్వొచ్చింది. నవ్వటం బాగోదని. నవ్వాపుకుని చావాల్సొచ్చింది. "ఐతే, అరూ మీకు సిస్టరవుతుందన్నమాట" అని అన్నాడాయన. ఆ వృత్తి నిండా నాకు డజన్లకొద్దీ సిస్టర్లున్నారు. ఆస్పత్రి నరసమ్మలను సిస్టర్ అని తొలిసారిగా వ్యవహరించినవాడికి ఈ కల్పాంతం వరకూ మోక్షం వుండదనేది నా గట్టి నమ్మిక. నాకు నవ్వు రావటం. సోదరీ అనే భావానికి కాదు. సిస్టర్ అనే పదానికి. నా ఆస్పత్రి జీవితంలో సిస్టర్ అనే పదానికి ఒక అర్థం, ఒక భావం ఏర్పడింది. అది సోదరి అనే భావానికి భిన్నం.

మరో అరగంటకి అరుంధతి తేరుకుంది. మౌనంగా మావంక చూస్తూ వుండిపోయింది. భర్త పరామర్శలకు క్లుప్తంగా జవాబిచ్చింది. నేనెవర్ననిగానీ. నాగురించిగానీ వక్కమాట కూడా అడగలేదు. ఆసందర్భాన్నిబట్టినే నొక వైద్యుణ్నని అర్థమవుతుంది. నేను కుర్చీలోంచి లేస్తూవుండగా 'అంజాదలీగారు వూళ్ళో లేరా' అని భర్తనడిగింది: లేరనీ నన్ను బలవంతపెట్టి తీసుకొచ్చినట్లూ చెప్పాడు. అప్పుడు నావైపు నిర్లిప్తంగా చూసినట్లనిపించింది. బంధుత్వపు టార్కియాలజీ తాలూకూ రహస్యాన్ని వెల్లడించేందుకు వుపోద్ఘాతం లాంటిది ప్రారంభించాడు. తొందరపనేదో వుందని చెప్పి లేచి వొచ్చేశాను.

ఆ మరుసటి రోజు సాయంత్రం సిస్టర్ వకుళతో సినిమాకు బయల్దేరుతూ వుండగా అరుంధతి గుర్తుకొచ్చింది. రెండు రోజుల తరవాత అంజాదలీ ఒచ్చాక ఆ విషయం చెబితే "రెండేళ్ళబట్టి నేనే ట్రీట్ చేస్తున్నాను. లోకనాథంగారు రుణపడే మనిషి కాదు: బాగా ముట్టజెపుతారు. ఐనా, విసిగిపోయాను. ఈ రెండేళ్ళలో ఆవిడకి పది పదిహేను రకాల అస్వస్థత లొచ్చాయి. ఏదీ సరిగా అంతుపట్టదు. ఓ రకమైన మానసిక అశాంతి సంచలనాలలోంచి ఈ శారీరక చిహ్నాలు జనిస్తున్నాయేమోనని వొక్కోసారి అనిపిస్తుంది" అని అన్నాడు. ఆ తరువాత అరుంధతిని మర్చిపోలేదు గానీ ప్రత్యేకించి ఆలోచించలే దెప్పుడూ. ఆర్నెల్ల తరువాత మరోసారి వెళ్ళాల్సి వచ్చింది. మరో ఆర్నెల్లకి ముసలాయన అంజాదలీ పోయాడు. ఈ తొమ్మిదేళ్ళ కాలంలో యెన్నో సంఘటనలు జరిగాయి ఆవిడ శరీరంలో.

నేను వొక డాక్టరుగా కాక వాళ్ళింటికి సంబంధించిన వక వ్యక్తిగా స్థిరపడిపోయాను యేదో అనుబంధం. ఎక్కువ రోజులు అరుంధతిని చూడకుండా వుండలేని తను. ఫీజు తీసుకోలేదెప్పుడూ. వోతూరి రవ్వల ఉంగరం, మరోతూరి మరొకటి - అలా యేదేనీ బలవంతంచేసి బహూకరిస్తూ వుంటాడు. లోకనాథం: గొప్పనేస్తం.

అలా ఆనాడు బలవంతంమీద వెళ్ళిన రెండేళ్ళ లోపున ఆస్పత్రిలో సిస్టర్లందరూ నాకు దూరమవసాగారు. సోదరిను లవసాగారు. మళ్ళీ స్టేట్స్‌కెళ్ళి చెయ్యాలనుకున్న రిసెర్చి కొనసాగలేదు. ఆస్పత్రి; లేనప్పుడు కొంపకొచ్చి వైద్యం, ఆంత్రొపాలజీ, సోషియాలజీ, సాహిత్యం పుస్తకాలు చదవటం. సాయంత్రాలు యేంతోచకపోతే, వెడితే కాసేపు క్లబ్బు కెళ్ళటం: లేదూ, అరుంధతి కూతురు మాధవిని తీసుకుని సినిమా కెళ్ళటం. నాకు తెలిసిన పదేళ్ళలో వొక్కసారి కూడా అరుంధతి సినిమాకెళ్ళలేదు. ఏదైనా, బంధువుల పరిచయస్తుల యిళ్ళలో యేవైనా క్రతువులు జరిగితే అలా వెళ్ళి యిలా వొచ్చేసెయ్యటం తప్ప, యిల్లు విడిచి వెళ్లే అలవాటు లేదు. అరుంధతికి, సాహిత్యమే కాలక్షేపం.

అబిడ్స్‌లో బస్సు దిగి, తాజ్‌లో భోంచేసి, కింకోఠీ మీదుగా కొంపకి చేరుకునేసరికి, వరండాలో యెవరో గచ్చుమీద పడుకున్నట్లనిపించింది.

ఎవరైనా కోర్టుపని మీద వొచ్చినశాల్తీ ఐవుండొచ్చు. ఎక్కడెక్కడి చుట్టరికాలూ తిరగేసుకుని వొస్తుంటారు. ముందుగది

ఇచ్చి యథేచ్ఛగా వుండమంటే సరిపోదు. గాలీ–నీళ్ళ మార్పుకి ఒచ్చే జలుబు జ్వరాలతోపాటు కోర్టుపనులుకూడా చూసిపెట్టాలి. అక్కడికీ వీలైనంతవరకూ కోర్టు గొడవలు నా దగ్గర ఎత్తొద్దని తెగేసి చెబుతాను.

పంచె కుచ్చిళ్ళు విదిల్చి, ఉత్తరీయం విసిరి దులిపి "అప్పుడనగా వొచ్చి నీకోసం ఎదురు చూస్తున్నానురా రవీ—" అన్నాడు మా పిన్నత్త కొడుకు; చంకలో దస్తరం. ఆ పట్టున వారం రోజులు వాడితో విసిగి పోవాల్సొచ్చింది.

చిట్టచివరకు ఈ సాయంత్రం వాణ్ణి రైలెక్కించి, కొంపకొచ్చి, స్నానించి, బట్టలు వేసుకుంటూ వుండగా ఫోను మోగింది–అరుంధతి. ఉదయం మాధవి వొచ్చిందట.

రెండేళ్ళనుంచి శాంతినికేతన్‌లో చిత్రలేఖనం నేర్చుకుంటోంది మాధవి. అక్కడికి వెళ్ళి చిత్రలేఖనం నేర్చుకుంటానని మాధవి అంటే. అరుంధతి ససేమిరా వొప్పుకోలేదు. లోకనాథం, నేనూ పట్టుబట్టి యెన్నో విధాల నచ్చజెప్పినా వినలేదు. తన కూతురు తనని విడిచి దూరంగా వుండకూడదంటుంది. ఆఖరికి మాధవి నిరాహారదీక్షలాంటిది ప్రారంభించాక రాజీపడింది–ప్రతి మూణ్నెల్లకీ యింటికి వొచ్చి వెళ్ళే షరతు.

నా డొక్కుబండీ మోత విని, గుండయ్య వరండాలోకి వొచ్చాడు. అందరూ వున్నారా అని అడిగాను— లోకనాథం కేంపుకెళ్ళి మూడు రోజులైంది; మాధవి తన స్నేహితురాలితో కలిసి బజారెళ్ళింది. అరుంధతి మేడమీద తన గదిలో వుంది.

నేరుగా పైకి వెళ్ళాను. పేము కుర్చీలో కూర్చుని చిత్రలేఖనాలు పరిశీలిస్తోంది.

గమనించి, 'రవీ, నువ్వొచ్చి వారంపైగా అవుతోంది. నీమీద కోపం తెచ్చుకోవాలని చాలా ప్రయత్నించాను సుమా!' అంది, పెదవులతో నవ్వుతూ చాలా ఉత్సాహంగా కనిపించింది.

"మాధవి బజారెళ్ళిందటగా–"అన్నాను.

"వూఁ, వెళ్ళింది. రవీ నీతో చాలా విషయాలు మాట్లాడాలి. ఈ రాత్రికి మళ్ళీ నీకు ఆస్పత్రి డ్యూటీ లేదుకద? ఐనా నీ డ్యూటీ వుండడం, లేకపోవడం యేవిఁల్లే–యే క్షణంలో ఐనా పరుగుతియ్యాల్సి రావొచ్చు" అంది.

"అలాంటి కేసులేం లేవులే. నువ్వు ఇవాళ అదోలా అనిపిస్తున్నావు. ఇంతకాలం నే నెరిగిన అరుంధతిలా అనిపించడం లేదు.

"నేనా! అలాగా! అవును- నేను కొత్త అరుంధతిని, కొత్త అరుంధతిని రవీ." కంఠంలో వుద్విగ్నత స్ఫురించింది.

చూడగా, కాసేట్లో వో సెడేటివ్ ఇవ్వాల్సివస్తుంది కాబోలు-అని అనుకుంటున్నాను.

"యేవిఁటి ఆలోచిస్తున్నావ్! నేనన్న మాటలేకదూ? అవును, అదే ఐవుంటుంది, నువ్వు నా మాటలు నమ్మలేవులే! లే, అలా వెనక తోటలో కూర్చునిమాట్లాడుకుందాం.' అంది.

మెట్లుదిగి వెళ్ళి వెనకపైపు గులాబీ తోటలో యినప చట్రపు ప్లాస్టిక్ అల్లిక కుర్చీల్లో కూచున్నాం.

తను భుజాల చుట్టూ కప్పుకున్న నల్లని వున్ని శాలువామీద కుట్టిన పట్టుదారపు లతలతో చిక్కడిపోతోంది వెన్నెల.

కాలిబాట కిరుప్రక్కలా విశృంఖలంగా పెరిగిన రకరకాల మొక్కల గజిబిజిలా. మధ్య పాపిట; అటూయిటూ. దూమెరుగ్గా రాసిన నూనెతో రేగిన వొత్తుజుట్టు; అక్కడొకటీ అక్కడొకటీ వింతగా మెరిసే తెల్ల వెంట్రుకలు; పేలుముడిలోంచి జారవిడిచిన జుట్టు కొసలు. ఆ తెలుపులో మరి కాస్త పసుపుతనం వుంటే మరింత కళగా వుండునని‌పించే ఛాయ. విశాలంగా పరుచుకున్నట్లనిపించే గుండ్రటి ముఖం; నల్లని నీడల పలయాల్లా అనిపించే కళ్ళు; గడ్డం కొస మధ్యలో చిన్న నొక్కు; కళ్ళకి కిందుగా యేర్పడిన సన్నని నొక్కు గీతల నగిషీ; కుంకుమ బొట్టును తమ మీద మోస్తున్నట్లుగా కదిలే గీతలు-నుదిటికి అడ్డంగా వకటి పొడవుగా, రెండోది కొంచెం పొడవు తక్కువగానూ.

"వూఁ యింతకీ యేవిఁటి విశేషం! అన్నాను, ఆమె మీంచి నా దృష్టి మరల్చుతూ.

"నయనతార వుదయం ఆరు గంటలకి వచ్చింది. త్వరలో పెళ్ళి చెయ్యాలి."

నవ్వి, "యిరవైయేళ్ళు నిండీనిండకండానే పెళ్ళి చెయ్యాలనే తొందరపాటు మంచిదేనంటావా?" అన్నాను.

"లేదు రవీ, చదువుకీ, వయసుకీ మధ్య పెద్ద తిరని సమస్య వుంది. పాతికేళ్ళు నిండనిదే యే చదువూ సరిగా పూర్తికాదు. వయసు, ముఖ్యంగా ఆడపిల్లలకి సంబంధించి, పదిహేనేళ్ళు దాటబోతున్న దగ్గర నుంచి దేనికోసమో తొందరపెడుతుంది. చదువుకోసం పదేళ్ళపాటు కోర్కెల్ని కట్టిపడేసుకోవాలి. కాన్వెంటు చదువు-యేమైపోతుందోనని మొదట్లో భయపడ్డాను. బియ్యే ఐపోయాక యిక చదువు చాలిస్తానని చిత్రలేఖనంలో ఆసక్తి వుందనీ నయనతార అన్నప్పుడు యెంతో సంతోషించాను. కానీ చిత్రలేఖనంకూడా, ఏదో ఇంట్లో కూచుని సరదాకి నేర్చుకునేది కాదని తరవాత అర్థమైంది నాకు. మూడేళ్ళ ఇక్కడ ఫైనార్ట్స్ స్కూల్లో నేర్చుకుందికదా–ఆ తరవాత నా కిష్టం లేకపోయినా అంతదూరం పంపక తప్పిందికాదు. భగవంతుడు దయవల్ల నేటికి అంతా సక్రమంగానే ఉంది."

"ఐతే పెళ్ళి సంబంధాలు చూడమంటావా? తన తల్లితో సమానంగా అందమూ, గుణమూ, సంస్కారమూ వున్న మాధవికి పెళ్ళి ఖాయపరచటం ఎంతలో పని! పైగా ఆస్తిపరులు!"

అరుంధతి తల వొంచి, చూపుడువేలితో ప్లాస్టిక్ పట్టీలమీద గీస్తోంది. ఎందుకో అంతలోనే దిగులుగా వున్నట్లనిపించింది.

"అరుంధతీ!"

తుళ్ళిపడినట్లుగా కదిలి, తల పైకెత్తింది.

"ఏవిఁటి దిగులు?" అన్నాను.

"అబ్బే, దిగులు కాదు." అని నవ్వింది.

"మరి? పెళ్ళి సంబంధం ఖాయపరిచేశావా యేవిఁటి, నాకు తెలియకుండానే!

"నువ్వుండగా నయనతార పెళ్ళి ఏనాడూ సమస్య కాదు. నెల రోజుల్లో బోలెడు మంచి సంబంధాలు చూడగలవనీ తెలుసు. కానీ నయనతార తనకి కావల్సిన భర్తని తనే చూసుకుందిట. తనతోపాటు చిత్రలేఖనం నేర్చుకుంటున్నాడుట. వాళ్ళది అలహాబాదుట-"

"తెలుగు వాళ్ళేనా?"

"వుఁహూఁ. నా కెలాగో వుంది, గతి లేనట్లుగా పోయిపోయి యెవరో హిందీ వాళ్ళని చేసుకోవటం. ఇన్నాళ్ళు నాకెందుకు చెప్పలేదని అడిగాను. కోపమొచ్చి. యేదో అస్పష్టభావం తప్ప తమకే రూఢిగా తెలీదట, తాము ప్రేమించుకున్నట్టు. అది చాలా బలీయమైందని మూణ్నెళ్ళ నాడు అనుకున్నారట. వొస్తూనే వున్నానుగా, ఇంతలో వుత్తరంలో రాయటం దేనికనుకుని వూరుకుందిట."

"నచ్చజెప్పటానికి ప్రయత్నించక పోయావా?'

'ప్రేమించకుండా వుండాలేగానీ, నిజంగా ప్రేమించినప్పుడు నచ్చజెప్పబోవటం అవి

వేశం. ప్రేమించానని చెప్పాక, మనం చేయ గలిగిందేమీ లేదు. తొందరపడి ఏర్పాట్లు చెయ్యటం తప్పు.'

"నువ్వు అలహాబాదు వెళ్ళి వివరాలు కనుక్కో మంటావా?"

'తర్వాత ఆ భారం నీకు తప్పదు. అత నిని ఆహ్వానించిందట. వాళ్ళ ఊరు వెళ్ళి రెండు రోజుల్లో అటునుంచి యిక్కడికి వస్తాడట. మనిషో వొకర్ని మాటవరసకి అనుకుందా, యింతదాకా వొచ్చిందంటే—'

'పిల్లలు తమ భావాలను పెద్దలకు చెప్పు కోవటానికి సిగ్గుపడొచ్చు. అందుకోసం నువ్వు బాధపడకూడదు.'

"అట్టే, నేనేం బాధపడటంలేదమ్మకు. యివన్నీ యెలాగో దారికొస్తాయో యేమో ఆయన కూడా లేరు; రాంపూనుంచి యింకా ఆరు రోజులకిగాని తిరిగి రారు. ఆయనేమం టారో—

'నాన్నగారు యేవిషయమైనా అర్థం చేసుకోగల వ్యక్తి. ఆయనకి నేను వివర పరుస్తాను గానీ, ముందు నీ విషయం చెప్పు యీ పెళ్ళి చెయ్యటం నీ కిష్టమేనా?'

'జరిగిందేదో జరిగిపోయింది. ఈ దశలో తిరస్కరించటం తగని పని. పోతే, ఆ పిల్లడి విషయం తెలుసుకోవాలి. వొక్కడేగా నొక్కి కూతురికివా అని ఆ స్త్రీకోసం నాటకం ఆడనూవొచ్చు. ఆ అనుమానం నన్ను పీడిస్తోంది. అక్కడికీ అడగాల్సిన వివరాలన్నీ అడిగాను. అతనలాంటివాడు కాదు; మనకన్నా తను వున్నవాడు. వో చక్కెర మిల్లులో వాటా, పంచెకరాల మామిడి తోటా వుంది. ఒకసారి మా క్లాసు వాళ్ళందరం ఆగ్రా వెళ్ళినప్పుడు అటునుంచి వాళ్ళ వూరు తీసుకెళ్ళాడు మా అందరినీ. అనుమానం వుంటే రవి మావయ్యని పంపించి తెలుసుకో-మ్మా.

మన ఆ స్త్రీకోసం నాటకం ఆడుతున్నట్లు అనుకోవటానికి వీల్లేదు. నాన్నగారు ఫలానా అనే చెప్పానుగానీ మనకి వున్నదీ లేనిదీ వివరాలు నేనసలు చెప్పనేలేదెప్పుడూ. నీ కూతుర్ని అంత కానిపని చేస్తానా చెప్పమ్మా—అని అంది. రెండు రోజుల్లో వస్తాడటగదా—చూసి మాట్లాడాక ఒకసారి నువ్వు వాళ్ళ ఊరు వెళ్ళి రావాలి రవీ. నయనతార నీ కూతురులాంటిది నీ భారం నీకు తప్పదు నీ బావగారెప్పుడూ కమిటీలూ కేంపులూ అంటూ హడావిడిగా తిరుగుతూ వుంటారు. వాళ్ళు ఆస్తిపరులు అవునా కాదా అనేది ముఖ్యం కాదు. పిల్లడి గుణ గణాలు, ప్రవర్తనల గురించి వాకబు చెయ్యాలి."

"అలాగే వెళ్ళి తెలుసుకుంటాను; నువ్వు నిశ్చింతగా వుండొచ్చు."

"అన్నీ సక్రమంగా వుండి, అంతా సక్రమంగా జరిగిపోతే—"

"నీకా దిగులక్కర్లేదు మాధవి అ వేసరాలంటావా!"

"ప్రేమకీ వివాహానికీ అవినాభావ సంబంధం వుండనక్కర లేదు."

అలికిడి అయినట్లుగా అనిపించి ప్రక్కకి చూశాను. గుండయ్య వొస్తున్నాడు.

"మాధవి వొచ్చిందేమో, చెప్పటానికి వొస్తూ వుంటే వుండాలి గుండయ్య." అన్నాను.

"దవఖాన కెల్లి ఫోను శేసిండ్రయ్యో నీకు. జల్ది రావాలన్నట."

'ఎవరు చేశారు?'

"గదేమో తెల్వదే. నంబరిచ్చిండ్రు."


లేచి లోనికి వెళ్ళాం. నంబరు చూశాను. అది ఆస్పత్రినుంచి కాదు. గురుపర్‌షాద్ ఇంటి ఫోను నంబరు.

నంబరుతిప్పి మాట్లాడి, రిసీవరు పెట్టేసి, "సెటిల్‌మెంటు లిమిటెడ్ గురుపర్‌షాద్ తల్లికి గుండె జబ్బు తీవ్రం అయిందట" అన్నాను.

'మీరు డాక్టరు వుద్యోగాలో—అంటారే అనుకోయ అంటూ వుంటుంది, మాధవి డాక్టర్ పదివిడవాళ్ళేవ్వ చెయ్యొద్దని.'

"అందరు డాక్టర్లకి అలా కాదులే. కార్డియాలజిస్టులకే యీ అవస్థలు. వుదాహరణకి స్కిన్ స్పెషలిస్టు — అతని రోగులు వేళకాని వేళలో, అర్ధరాత్రి అపరాత్రి తలుపు తట్టరు. అతని రోగులు చనిపోరు. వ్యాధులు నయం అవుతాయి. యేనాటికీ పూర్తిగా నయం కావు." అని నవ్వి, 'మరి వస్తాను అరుంధతీ, యింకేం ముఖ్యమైన కబుర్లు లేవుకదా — పొద్దుపోకపోతే తిరిగి వొచ్చేస్తాను. మాధవితో మాట్లాడదాం ఆ విషయం.' అని బయలేరి ఆ గురుపర్‌షాద్ యింటికి వెళ్ళాను.

ఆ ముసలావిడ్ని పరీక్షించి, ఆస్పత్రికి తరలించి. మళ్ళీ యెక్స్‌రేలూ, రీడింగూ వగైరాలు అయ్యేసరికి పన్నెండైంది. మధ్యలో భోజనం తెప్పించుకుని ఆస్పత్రి లోనే తిన్నాను. అలసటగా కొంపకి చేరు కుని వుదయం ఆలస్యంగా నిద్రలేచాను. కాలేజీలో వో క్లాసుంది యీ రోజు. అది యయ్యాక మళ్ళీ ఆస్పత్రి. గురుపర్‌షాద్.




యింటిదగ్గరికి వెళ్ళకుండా అక్కడే వున్నాడట. ఆ ముసలావిడ పరిస్థితి విషమంగా వుంది. అదలా వుండగా మరో రెండు కేసులు అలాంటివే వొచ్చిపడ్డాయి. వో ఆరు గంటలు కొంపలో నిద్ర-మళ్ళీ ఆస్పత్రి. రాత్రి తొమ్మిది గంటలకి లోకనాథం యింటి నుంచి ఫోను-అరుంధతి మాటా పలుకూ లేకుండా పడిపోయిందట. ఆస్పత్రిలో రోగు లకి చెయ్యవలసిందంతా చేసి అవసరం అయితే ఫలానా నంబరుకి ఫోను చెయ్యమని చెప్పి అరుంధతి దగ్గరికి వొచ్చాను.

వరండాలో, నా కోసమే యెదురు చూస్తున్నట్లుగా నిలుచుని వున్నాడు, గుండయ్య.

అరుంధతి కోసం వున్నపాటి నిస్పృహ లాంటిది ఆమె గదిలో అడుగుపెట్టాను. అలమరా తాళం తీసి సామగ్రి బల్లమీద పెట్టుకున్నాను. పల్స్ చూసి, బ్లడ్‌ప్రెజర్ పరీక్షించాను. ఓ. కె. మిగతా పరీక్షలు—అంతా ఓ. కె. అయోమయంగా అనిపించింది. ఫెయింటలు వుంటుందను కుని ఓ ఇంజక్షనిచ్చి, మరోసారి నాడి చూశాను.

గుమ్మానికి లోపలి ప్రక్కగా గుండయ్య నిలుచుని వున్నాడు.

"మాధవి ఎక్కడ?" అని అడిగాను.

"గా అయ్యను తోలుకోని బయటికి పోయిండ్రు."

"ఏ అయ్యను?"

"మన శిన్నమ్మతోటి సదువుకున్నరట. గా అయ్య వొచ్చిండు పొద్దుగాల. ఇద్దర్కా పోతరట."

"మంచిది గుండయ్యా నువ్వెళ్ళి పని

చూసుకో. మాధవి వొస్తే చెప్పు. అన్నట్లు ఎంతసేపైంది అమ్మగారు ఇలా ఐ?"

"నా యిద్దరు పోయిన యేగ్గంట కయ్యుం డాల. చాయ్ తీస్తోని వొస్తిగదా గిట్లున్నదు."

"సరె మంచిది" అన్నాను. గుండయ్య వెళ్ళిపోయాడు.

మళ్ళీ పరీక్షించటం ప్రారంభించాను. యేమీ అంతుచిక్కలేదు.

వున్నట్లుండి నా దృష్టి కదులుతూన్న ఆమె కుడి పాదం మీద పడింది. వేళ్ళు వణుకుతున్నాయి. రికార్డుచేస్తే ఆ చలనంలో సెకనుకి యెన్ని ప్రకంపన లుండేదీ వూహించాను. నిట్టూర్చి, లేచి సామగ్రి తెచ్చి యెలక్ట్రికల్ షాక్ యిచ్చాను. కదిలి పోదిగినట్లైంది. మరో నిమిషానికి కను రెప్పలు తెరిచింది.

"అరుంధతీ"- అన్నాను. నుదుటి పై భాగాన అరచెయ్యి ఆన్చి.

రెప్పలు వాల్చింది. కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి. చేరుమాలు తీసి తుడిచాను.

ఐదు నిమిషాలు గడిచాయి.

'యెలా వుంది వొంట్లో - బాగా నిస్సత్తువగా అనిపిస్తోంది కదూ?' అన్నాను, అవునన్నట్టు తల కదిపింది.

లేచి సిరెంజీ సూది స్టెరిలైజ్ చేసి ఓ ఇంజక్షన్ ఇచ్చాను. బెల్లు నొక్కాను. గుండయ్య వొచ్చాడు. వోవల్టిన్ తీసుకు రమ్మని చెప్పాను. ఐదు నిమిషాల్లో తెచ్చి యిచ్చి వెళ్ళాడు.

తలకింద దిళ్ళు ఎత్తుగా జరిపి, చెయ్యి ఆసరాగా ఆన్చి, కుడిచేత్తో కప్పు పుచ్చుకొని తాగించాను.

'నీ ఋణం ఎన్ని జన్మలకూ తీర్చుకో లేను రవీ—' అంది, బలహీనంగా. కళ్ళ నుంచి నీటిబొట్లు రాలిపడ్డాయి.

'నువ్వు నిజంగా నాకు ఋణపడివుంటే మాత్రం వచ్చే జన్మలో తప్పక తీర్చుకో గలవు.'

'ఐపోయింది రవీ అంతా ఐపోయింది. నేను పుట్టకపోయివుంటే యెన్నో ప్రాణులకి బాధ లేకుండా పోయేది' అంది.

"విషయ మేమిటో చెప్పు అరుంధతీ. మాధవి స్నేహితుడు వొచ్చినట్లు గుండయ్య చెప్పాడు. అతను తగినవాడు కాదా?

"లేదు. ఇంకొకరిమీద అభాండం వెయ్య లేను. అతను మంచివాడు. చాలా మంచి వాడు. కానీ ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు."

"అర్థం లేకుండా మాట్లాడకు. విషయ మేమిటో చెప్పు."

"మరేం లేదు. అతను మంచివాడే. కానీ యీ పెళ్ళి నాకిష్టంలేదు."

"మతి స్తిమితం లేకుండా పోయినట్లుగా మాట్లాడకు. నీ వ్యక్తిగత యిష్టా యిష్టాలకు ఆ పసివాళ్ళ జీవితాలు బలి కావడం అన్యాయం, కానీ- కానీ- నువ్వు అలాటి స్వార్థపరురాలివి కావు. నీ మతి సరిగాలేదనే చెప్పాలి.'

"నా మతి బాగానే వుంది రవీ. కానీ ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు."

ఆమె ముఖం, వికారంగా వొంపులు తిరిగి, చిరునవ్వులా అంతరించింది.

చేత్తో ఆమెను కుదిపి యిలాగే జాప్యం చేస్తే పరిస్థితి ముందుముందు చెయ్యి జారిపోతుంది. నీ మానసికఅస్వస్థకి తగిన చికిత్స వెంటనే అవసరం, బొంబాయిలో హింగావేంకర్ అని వో మానసిక వైద్యుడున్నాడు. అతనికి చాలా నైపుణ్యమూ అనుభవమూ వుంది. అతనిని పిలిపించి చూపెడతాను. కానీ-ఆ యెక్విప్‌మెంటు అంతా లేనిదే విశ్లేషించడానికి వీలుకాదు. నిన్నే బొంబాయికి తీసుకెళ్ళాలి. బావగార్ని వెంటనే రప్పించి నిన్ను బొంబాయి తీసుకెళ్ళాలి.' అన్నాను.

'అనవసరం రవీ. నాకలాటి మానసిక వ్యాధులేవీ లేవు. నేనేమిటో నాకు తెలుసు.'

'అలా ఐనప్పుడు యిలాగే అంటారు.'

'నేను రాను.'

'యిలా మొరాయించటం ఆ వ్యాధి ధోరణిలోని భాగమే.'

'రవీ నా మాట నమ్మలేవా? అదేమీ అక్కరలేదు. నేనేమిటో నాకు తెలుసు. నేను పిచ్చిదాన్ని కాదు.'

'నాకిప్పుడు రూఢిగా అవగతం అవుతోంది నీ స్థితి. వెంటనే నీకు చికిత్స చేయించాలి. పిచ్చి అని నేనూ అనటంలేదు పిచ్చి అనే పదం సరైంది కాదు.'

'నాకిప్పుడేమైందని యిదంతా చెయ్యాలి?'

'నీ మనసును వివరించటం నీక్కూడా తెలియని నీ మనసును తెలుసుకుంటారు.'

'నేను చెప్పకుండా నా మనసును తెలుసు కోగలరా? అదెలా సాధ్యం!'

వివరించాను ఐదు నిమిషాలపాటు.

'నాకు తెలియకుండా నా మనసు లేదు. నా మనసు నాకు తెలుసు. యిదంతా నీ పొరబాటు అభిప్రాయం!'

'యిలా మొండికెత్తడం కూడా ఆ ధోరణి లక్షణమే. యిప్పుడే బావగారికి ట్రంకాల్ బుక్‌చేసి పిలిపిస్తాను. మనం వెంటనే బొంబాయి వెళ్ళితీరాలి.'

"నాకిష్టం లేదు. నేను రాను."

"నీ ఇష్టాలతో పనిలేదు. నా మాటమీద బావగారికి గురి వుంది. ఉదయంలోగా అన్ని ఏర్పాట్లూ జరిగితీరాలి. ఇప్పుడే ట్రంకాల్ బుక్‌చేసి వస్తాను" అని లేచాను.

"రవీ, వీల్లేదు." ఆమె మాటలు కఠినంగా, కర్కశంగా ధ్వనించాయి. దిమ్మెర పోయి ప్రక్కకు తిరిగి చూశాను.

ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి యేడుస్తూంది.

దగ్గరికి వెళ్ళి నుదుటిమీద చెయ్యివేసి "అరుంధతీ మూర్ఖంగా ప్రవర్తించకు. నా మాట విను. ఐదారు నెలల్లో నీ మనసు కుదురుకుంటుంది. తెలిసీ నీ మానసిక స్థితికి మాధవి జీవితాన్ని బలివ్వలేం. ఈ పెళ్ళి జరిగి తీరుతుంది."

"అది అసంభవం రవీ."

"నీ మనసు సరైన తరవాత నువ్వే నీ చేతుల మీదుగానే చేస్తావు అరుంధతీ. ప్రస్తుతం నా మాట విను."

"లేదు రవీ, ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు. నేను మామూలుస్థితిలోనేవున్నాను. నా మాటనమ్ము రవీ. నీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను విశ్వసించు...."

ఆమె గొంతులో మాటలు పూడిపోయాయి.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కానీ నిప్పురవ్వను చేతిలో పెట్టమనే పసిపాపను ఎంత అంగీకరిస్తామో అరుంధతినీ అంతే అంగీకరించాలి.

ఐదు నిమిషాలు నిశ్శబ్దం.

"రవీ."

నేను మాట్లాడలేకపోయాను.

"రవీ నా మాట వినవూ?"

"లేదు అరుంధతీ. నీ శ్రేయస్సూ, మాధవి శ్రేయస్సూ కోరితే మాత్రం యీ విషయంలో నీ మాట వినడానికి వీల్లేదు.

"ఐతే ఆ వైద్యులు నువ్వు చెప్పిన రీతిలో నా మనసును వివరించగలరంటావా?"

"అది వాళ్ళకి చాలా స్వల్పవిషయం. చెబుతున్నట్లు నీకు తెలియకుండానే, నువ్వు నీ మనసును, చిన్ననాటినుండి నేటివరకూ వివరించి చెప్పుకుంటావు. అందులో నీకిప్పుడు గుర్తులేకుండా మరుగున పడిపోయిన విషయాలు కూడా వెలికి వొస్తాయి—

ఆమె వెక్కి వెక్కి ఏడవటం విని ఆగిపోయాను.

ఓదార్చాలని అనుకున్నా తటపటాయిస్తున్నాను. ఇప్పుడు లొంగిపోతే వాళ్ళ జీవితాలను నాశనం చేసినవాణ్నవుతాను. కనీసం మానవతాభావంతో ఒక వైద్యుడిగా నా విధిని నేను నిర్వర్తించాలి..."

"ఇలా దగ్గరగా వొచ్చి కూర్చో రవీ" నూతిలో గొంతుకలా వినిపించాయి మాటలు.

ఆలోచనలోంచి తుళ్ళిపడి, వెళ్ళి మంచం ప్రక్కగా కుర్చీలో కూర్చున్నాను.

"అరుంధతి నా మాట వింటావుకదూ-" అన్నాను ఒప్పుకోదని తెలిసీ.

"ఆ అవసరం లేదు రవీ. నేనే వివరిస్తాను విను."

మళ్ళీ వెక్కి వెక్కి పడుతోంది. ఆమె చేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను.

"వాళ్ళిద్దరినీ, రవీంద్ర భారతిలో నాటకాలు వేస్తూంటే-చూసి రమ్మని పంపించాను. తిరిగి వొచ్చేలోగా నీకిప్పుడు కొన్ని సంగతులు చెప్తాను. అవి మనిద్దరిలోనే వుండిపోవాలి. నీ మీద నాకు నమ్మకం వుంది రవీ—ఎన్నిసార్లో నీకు చెప్పుకోవాలనుకొన్నా చెప్పుకోలేకపోయాను.

అతను ఉదయం వొచ్చాడు. మధ్యాహ్నం భోజనాల దగ్గర పరిచయం చేసింది. పేరు దయాసాగర్ మిశ్రా. రూపానికీ గుణానికీ నయనతారకి తీసిపోడనిపించింది. హిందీ, ఇంగ్లీషు, కొద్దిగా బెంగాలీ వొచ్చుట. భోజనాలయ్యాక కబుర్లలో తన వివరాలు మరి కొన్ని చెప్పాడు. అతని తండ్రి పేరు విజయానంద్ మిశ్రా అని ఓ సుప్రసిద్ధ సర్జనులు అలహాబాదులో ప్రాక్టీసు చేస్తుండేవారట. పదేళ్ళనాడు వరదగాలికి వాళ్ళ యిల్లు కూలిపడిన సందర్భంగా తల్లిదండ్రులు మరణించారట. తన పినతండ్రి సంరక్షణలో పెరిగాడట. తనొక్కడే సంతానమట. సొంతవూరు అదేనా అని అడిగాను. తనకిఐదేళ్ళు వచ్చే వరకూ కలకత్తాలో పనిచేసేవారట. మరి కొన్ని వివరాలడిగితే నావైపు వింతగా చూసి సమాధానాలివ్వాడు. నేనింక వాళ్ళ ముందు కూర్చోలేక తలనొప్పిగా వుందనీ, సాయంత్రం రవీంద్ర భారతిలో మంచి కార్యక్రమం వుంది వెళ్ళమనీ చెప్పి - మేడ మీదికి వొచ్చాను, కన్నీళ్ళతో ఆ తరవాతెప్పుడో నేను నా స్వాధీనం తప్పి వుంటాను."

ఆమె ముఖంలోకి చూశాను.

చేతో ముఖం కప్పుకుని వెక్కి-వెక్కి పడసాగింది.

నాకు అంతాఅయోమయంగా అనిపించి. మౌనంగా వుండిపోయాను.

రెండు నిమిషాలు గడిచాయి.

"నేను స్కూలు ఫైనలు చదువుతున్న రోజులు. స్కూలు విడిచాక యింటికి వొచ్చే వేళకి వకతను నన్ను అనుసరిసూ వుండే వాడు. బియ్యే పాసయ్యాడట. ఐయెయస్ పరీక్షకి కూర్చోబోతున్నాడట. అతనిని చూస్తుంటే నా కెలాగో అవుతుండేది. రెండు నెలలలో మాపరిచయం సన్నిహితం ఐంది. వో రోజున మా యింటికి వచ్చాడు. వరండాలో కూర్చుని కబుర్లు చెప్పాడు. మంచినీళ్ళు కావాలంటే లోనికి వెళ్ళాను. తనూ వొచ్చాడు నా వెనక చప్పుడవకుండా. కౌగిలించుకుని యేవేవో అన్నాడు. నవయవ్వనం. కౌగిలి, ముద్దులు నన్ను మంత్రముగ్ధను చేశాయి. తరవాత- అతని ప్రయత్నాన్ని ప్రతిఘటించాను. కానీ అతను నా మాట వినలేదు. అది మళ్ళీ మళ్ళీ కోరుకునే బాధలాంటిది. కాస్సేపటికి నేను ప్రతిఘటించటం మానుకున్నాను. నన్ను నేను మర్చిపోయాను. నేను మళ్ళీ మామూలు అయ్యేసరికి ఒంటరిగా వున్నాను. ఆ రోజున మా నాన్నగారు వూళ్ళోలేరు. రంగయ్య సాయంత్రం వంటచేసి యెక్కడికో వెళ్ళాడు. మా అమ్మ నా పదిహేనో యేట పోయిందని చెప్పానుగా.

ఇది జరిగిన తరవాత మళ్ళీ అతను కనిపించలేదు. యెంతగానో యెదురు చూశాను. మూణ్నెల్లలో యేది జరగకూడదో అదే జరిగినట్లు నిర్ధారణ ఐంది. నేనెలాగో ఐపోసాగాను. మా నాన్నగారు, యేదో యేమిటో జరిగి వుండాలని అనుమానించారు నా స్థితి చూసి. ఆఖరికి ఆయనకి చెప్పక తప్పింది కాదు. అతని పేరు కూడా చెప్పాను. చెరువుగట్టునలోకాభిరామాయణంలోంచి అతని పేరు తెచ్చి ఆ వివరాలు తెలుసుకున్నారు మా నాన్నగారు-వూళ్ళో వొకాయన యింటికి చుట్టం చూపుగా వొచ్చి వుంటున్నతననీ, తన వూరు వెళ్ళిపోయాడనీ. ఆ వూరు వెళ్ళి అతనిని కలుసుకునేందుకు కొంతవరకూ ప్రయత్నించారు. కానీ అతని స్వభావం గురించి తెలిశాక, యింకా ముందుకుపోయి రచ్చ చేసుకోవటం అవివేకం అని అనుకున్నారు. యీ విషయం


దీపావళి

శుభాకాంక్షలతో

కరీం

విశాఖపట్టణం

గుట్టు చప్పుడు లేకుండా జరిగిపోవాలన్నారు, నమ్మే సాకు యేదో తెలిసిన వాళ్ళకి చెప్పి నన్ను తీసుకుని కలకత్తా వెళ్ళి పది నెలలు అనామకంగా గడపటం జరిగింది. ఆస్పత్రిలో మగ పిల్లడ్ని కన్నాను. పండంటి బిడ్డను చూసుకుంటూ కన్నీళ్లు పెట్టుకుంటూన్న నన్ను చూసి యేదో అనుమానించినట్లున్నాడు, ఆ డాక్టరు తెలివిగా యేవేవో మాటలు మాట్లాడి నా చేత నిజం చెప్పించాడు. వొచ్చీరాని యింగ్లీషులో నా గోడు వినిపించాను. ఆ మరునటి రోజున మా నాన్నగారితో మాట్లాడి ఆ పిల్లడ్ని తను తీసేసుకునే యేర్పాటు చేసుకున్నాడు. ఆ స్థితిలో అందుకు నాన్నగారు సంతోషించారు. నేను సంతోషించక చెయ్యగలిందేమీ లేకపోయింది. ఆ డాక్టరు పేరు విజయానంద్ మిశ్రా. పిల్లలులేరు. నడి వయస్సుంటుంది. తిరిగి వొచ్చిన కొద్ది నెలలకి ఆ డాకర్‌కి ఉత్తరం రాశాను. కానీ జవాబు రాలేదు. ఆ విషయం అంతటితో ముగిసింది.

ఇవాళ తెలుసుకున్న విషయాలలో దయాసాగర్ నా కన్న బిడ్డ అని రూఢి ఐంది. పుట్టగానే నన్నాకర్షించిన ఆ చెవి కింది పుట్టుమచ్చ కూడా ఋజువుపరుస్తోంది. విధి ఇంత ఘోరం తలపెడుతుందని యెవరనుకోగలరు! నా కన్నబిడ్డ నా ముందుకొచ్చి నిలుచుంటే బాబూ అని పిలవలేని నా స్థితికి నా హృదయం పగిలిపోయేలా వుంది. చెప్పకుండా యెలా ఉండగలను! యెలా అంతపాపం యింకా చెయ్యగలను!

ఈ పాత విషయం ఆయనికి చెప్పాలని మొదట్లో ప్రయత్నించాను. కానీ చెప్పలేక పోయాను, నేనంటే యెంతో యిది ఆయనకి. ప్రత్యేకించి యేమీ అనకపోయినా—చెప్పి ఆయన మనసును కలత పెట్టటం భావ్యం కాదనుకున్నాను. ఆ భారాన్ని ఏకాంతంగా నేనొక్కదాన్నే మోసుకుంటూ వొచ్చాను.

రవీ నన్ను అసహ్యించుకోకుండా ఇంకా నా దగ్గర కూర్చోలేవు—నువ్వు క్షమించి ఇక్కడినుంచి వెళ్ళిపో. ఈ పాప పంకిలంలో నిన్ను వక్కక్షణంకూడా నిలుచో నివ్వటం భావ్యం కాదు. ఆయన రాగానే ఈ విషయం నేనే చెప్తాను. కానీ మొదట్లోనే చెప్తే ఎంతో బాగుండేది. నేను పాపాత్మురాలినే. ఐనా ఆయనకి నన్ను క్షమించే అవుదార్యం వుంది. ఈ పెళ్ళి జరగకుండా చూస్తాను" అని ముగించి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"కానీ వాళ్ళిద్దరికీ ఈ విషయం చెప్పాలిగా నువ్వు?"

"చెప్తాను."

"అది ప్రమాదం. ఈ స్థితినీ ఎదుర్కోలేక ఏ అఘాయిత్యమైనా తలపెట్టొచ్చు. చెప్పకుండా అడ్డుపడితేనూ లాభం లేదు."

"మధ్యాహ్నం ఆ వివరాలు తెలిశాక, నన్ను నేను పూర్తిగా నిలదొక్కుకోలేకపోయాను. నా ముఖంలో వొచ్చిన మార్పు గమనించి అయోమయస్థితిలో పడిపోయారు, ఆ క్షణానికి యేదో నచ్చచెప్పాననుకో, తలనొప్పి వొచ్చిందని, వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో అన్న ఆసక్తిని అణుచుకోలేక కింద వాళ్ళ గది దగ్గరికి వెళ్ళి కిటికీ ప్రక్కగా నిలబడ్డాను. యేది జరక్కూడదో అదే చెయ్యడానికి సిద్ధంగా వున్నారని విదితమైంది. దయాసాగర్ యేదో సందేహం వెలిబుచ్చాడు. నయనతార అదేం కాదంది. కాదు, యిష్టం లేదేమో అన్నాడు అతను. అలా ఐతే మనం మరో జన్మలో ఐనా కలుసుకుందాం గానీ మరో రకంగా జీవితాలు సాగించేది లేదు: నా మాట నమ్ము — అని నయనతార అంది, అవసరం ఐతే ఈనాడు యిద్దరం కలిపి కన్ను మూసి మరో లోకంలో కను రెప్పలు విప్పుదాం గానీ జీవచ్ఛవంలా బతకటం నాతో కాదు— అని అతనన్నాడు. మా అమ్మా, నాన్నా తప్పక అంగీకరిస్తారు. మనకా భయం అక్కర లేదని ఇంకేమేమో చెప్పసాగింది. యిదీ పరిస్థితి. బాగా ఆలోచించి యే రకంగా చెప్పి విపరించి వొప్పించాలా అనేది ముందు చూడాలి అంది.

'ఈ విషమ పరిస్థితిలో ఈ రహస్యాన్ని మనిద్దరిలోనే దాచేసుకుని వాళ్ళిద్దరికీ పెళ్ళి చెయ్యటం వుత్తమం' అన్నాను.


'ఇంత ఘోరం నా చేతులతో నేను ఎలా చెయ్యగలను! ఆనాడు తెలిసీ తెలియని స్థితిలో ఆ తప్పు జరిగిపోయింది. కానీ ఈనాడు ఇంతటి పాపం ఎలా చెయ్యగలను. పాపం చెయ్యటానికికూడా వొక హద్దంటూ వుండాలి. యేకోదరులను నా చేతులతో నేను భార్యాభర్తల్ని చెయ్యటం, నా కన్నబిడ్డల్ని నా చేతుల మీదుగా, నా కళ్ళముందు - భగవాన్ - అంత ఘోరం నే చెయ్యలేని పని. లోకంలో యెవరూ చెయ్యగూడని పని. అని మణికట్టుతో నుదుటిమీద బాదుకుంది.

ఆమె చెయ్యి పక్కకి జరిపి పట్టుగుని, 'అరుంధతీ, అది నువ్వనుకునేంత పాపం కాకపోవచ్చు.' అని ఫలానా తెగలలో ఫలానా అని ప్రారంభించి పావుగంట విపరించి వొప్పించటానికి ప్రయత్నించాను.

"తర్కంతో తేల్చుకునే విషయం కాదిది. యే తల్లీ, యే తండ్రీ చెయ్యలేని పని యిది అంది.

"లేదు అరుంధతి యీ విషయంలో తొందరపడి వో నిర్ణయానికి రాక, రెండు రోజులు నింపాదిగా స్థిమితంగా ఆలోచించు' అన్నాను.

గుమ్మంలో అడుగుల చప్పుడైనట్లైంది.



దిగ్గునలేచివెళ్ళాను. మెట్లెక్కి వొస్తున్నాడు గుండయ్య.

గబగబా గదిలోకి వొచ్చి, "వాళ్ళిద్దరూ నేమో అని భయపడిపోయాను. గుండయ్య మెట్లెక్కి వస్తున్న ధ్వని. వాళ్ళతో చాల జాగ్రత్తగా మెలగాలి. యెలాంటి అనుమానాలకి అపార్థాలకీఅవకాశంకలక్కుండా ప్రవర్తించాలి. రెండు రోజుల్లో వోనిర్ణయానికి వొద్దువు. యీలోగా వాళ్ళతో వేరే రకంగా కొన్ని అంశాలు చర్చిస్తాను. యేపైఁనా యిది జరగటమే వుత్తమవఁని నా అభిప్రాయం" అన్నాను.

'దవఖాన కెల్లి ఫోన్ల మాట్లాడింగ్రు. నిన్ను రమ్మంటున్నారయ్యా– యేమిట్లో శెప్పాల్నంటున్నరు.' అన్నాడు గుండయ్య వచ్చి.

కిందికి వెళ్ళి ఫోన్లో మాట్లాడి వొచ్చి, 'గురుపర్షాద్ తల్లి, వో ప్రముఖ వ్యాపారి భార్య, వో గుమాస్తా కూతురు చావు బతుకుల్లో వున్నారట. నిలువెత్తు ధనం దిమ్మరించాల్సినా పరవాలేదు గానీ ప్రాణాలు రక్షించాలిఅని గురుపర్షాద్ అంటున్నాడు. మిగతా ఇద్దరి ధోరణి కూడా అంతే. వెళ్ళి తీరాలి. వుద్యోగ ధర్మమూ అంతే. కాని యీ పరిస్థితిలో నేను వెళ్ళలేను. ఫలానా వ్యక్తిని పిలిపించమని చెప్పి, నేను వుదయం వరకూ రావటానికి వీల్లేదనీ, క్షమించమనీ ఫోను పెట్టేశాను.' అన్నాను.

"చాలా ఘోరం రవీ. వెంటనే వెళ్ళు. ఆస్పత్రిలో యెన్నడూ చేరని నా ఆరోగ్యం కోసం వుండిపోవటం నీ ఉద్యోగ ధర్మానికే విరుద్ధం. వెళ్లు రవీ."

"ఈ స్థితిలో నేను ఎక్కడికీ వెళ్ళలేను. అలా అనుకునే స్థితిలో ఉద్యోగానికే రాజీనామా ఇస్తాను."

"వాళ్ళని ట్రీట్ చేస్తున్నది నువ్వేగా. అర్ధాంతరంగా రాజీనామా ఇస్తే ఆ చావు బతుకుల సమస్యలు పరిష్కారం కావు. అది అమానుషం. ఆ అమానుషత్వానికి కారణం నేనౌతాను. ఇంకా ఇంకా ఎన్ని పాపాలు చెయ్యగలను రవీ, జీవితంతో ఇంక పోరాడలేక అలిసిపోయినదాన్ని–నను మన్నించి వెళ్ళు రవీ–నా కిప్పుడొచ్చిన ఆపదేం లేదు. బాగానే వున్నాను. గంట గంటకీ నీతో ఫోన్లో మాట్లాడుతూ వుంటాను. ఏమాత్రం అవసరం ఐనా వెంటనే ఒచ్చేద్దువుగాని" అంది.

ఇష్టం లేకపోయినా బయల్దేరి ఆస్పత్రి కొచ్చాను. గంట తరవాత ఫోను చేసింది అరుంధతి నగానతార దయాసాగర్ ఓ సావుగం... ఉంచు వొచ్చారనీ: తను కాస్త తే...ంటున్నట్లూ మరో గంట తరవాత. కలిసి భోజనాలు ముగించారనీ, నేను లేని లోటు తలుచుకున్నారనీ! మధ్యాహ్నం తనలో అకస్మాత్‌గా వొచ్చిన మార్పుకు అస్వస్థతే కారణం అని అనుకునేలా ప్రవర్తించినట్లూ చెప్పింది. మరో రెండు గంటల వరకూ ఫోను రాలేదు. పేషెంట్ల గొడవతో నాకూ చెయ్యటానికి వీలులేకపోయింది. పన్నెండున్నరకి ఫోను చేద్దామనుకుంటూ వుండగా తనే ఫోను చేసి, తన వొంట్లో బాగానే వుందనీ కాస్సేపు ఏదో పత్రిక చూస్తూ కూచున్నట్లూ నిద్రవొస్తున్నట్లూ పడుకోమంటే పడుకుంటాననీ అంది. సరే పడుకోమనీ. యిక్కడ పని ఐపోగానే నేరుగా అక్కడికే వొచ్చేస్తాననీ చెప్పాను.

ఆ తరవాత యెవరిని గురించి ఆలోచించేందుకూ వీల్లేకపోయింది. గురుపర్షాద్ తల్లి పరిస్థితి మరీ అంత ప్రమాదకరంగాలేదు గానీ. మిగతా రెండు కేసులూ– సిజేరియన్ స్థితి కాదు, కానీ "అబోయిబో" అనే రీతిలో ఆపరేట్ చెయ్యాల్సి ఒచ్చింది. అదృష్టవశాత్తు అవి రెండూ విజయవంతమయ్యాయి. అలసి సొలసి, ఐదు గంటల వేళ ప్రక్క వరండాలో కుర్చీ వేయించుకుని కూలబడ్డాను.

మరో కొత్త ఉదయం ఆరంభమవటానికి చేస్తున్న సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కాళ్లు చాపుకుని తల వెనక్కి ఆని కనురెప్పలు వాల్చాను. చల్లగా పవిత్రంగా తాకుతోంది,గాలి.

అంతలోనే పిలుపు. దిగ్గున లేచాను. అంతలోనే కాదు. బాగా ప్రొద్దెక్కింది. ఎనిమిది గంటలై వుండాలి. చే గడియారం కేసి చూసుకున్నాను. యెనిమిదీ పది.

ఫోనుట. లోకనాథం ఇంటినుంచి–లోనికి వెళ్ళి రిసీవర్ అందుకున్నాను. ఉన్నపళంగా వొచ్చెయ్యమని. గుండయ్య మరింకేం అడిగినా జవాబు లేదు. రిసీవర్ వెంటనే పెట్టేసిన ధ్వని వినిపించింది.

మంచులో తడిసినా వెంటనే స్టార్టయినందుకు నా డొక్కుకారును అభినందించుకుంటూ వేగం హెచ్చించాను. ఈ డొక్కుకారు అరుంధతికి కూడా నచ్చటం చిత్రం. మా యిద్దరి మనసూ దీనికి తెలుసు. అందుకే సంగతి సందర్భం తెలిసి ప్రవర్తిస్తుంటుంది. ప్రొద్దుట కాఫీ ఫలహారాల దగ్గర అరుంధతి యేపైఁనా బయటపడిపోం... వాళ్ళ

ప్రఖ్యాత రచయిత్రి

రంగనాయకమ్మగారి రచనలు

బాపుముఖచిత్రాలతో వెలువడినవి!

| | |
|---|---|
| ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది | 4–00 |
| అంధకారంలో | 9–00 |
| కృష్ణవేణి | 6–50 |
| బలిపీఠం | 8–00 |
| కూలిన గోడలు | 8–00 |
| రచయిత్రి | 8–00 |
| స్త్రీ | 7–00 |
| కళ ఎందుకు | 8–00 |
| ఇదేనా న్యాయం | 8–00 |
| అండాళ్ళమ్మగారు | 4–00 |
| పేక మేడలు | 4–00 |
| చదువుకున్న కమల | 4–00 |
| నా డైరీలో ఒక పేజీ | 2–00 |
| స్వీట్ హోమ్–2 | 3–00 |
| పందిట్లో పెళ్ళవుతోంది | 3–00 |
| గులాబి పూసింది | 5–00 |
| శోభనం రాత్రి | 5–00 |
| నాకు చచ్చిపోవాలని వుంది | 4–00 |
| షణ్ముఖప్రియ | 3–00 |

రూ॥ 90 M.O. చేసిన పుస్తకాలు రిజిస్టర్ పోస్టులో పంపబడును. ప్రతి మూడు పుస్తకాలకు పోస్టేజి ఉచితం!

ప్రఖ్యాత రచయిత్రి 'వాసిరెడ్డి సీతాదేవి' గారి రచనలు 'బాపు' ముఖచిత్రాలతో వెలువడినవి.

| | | |
|---|---|---|
| 1. మృగతృష్ణ | — | 6–00 |
| 2. ఆడపిల్ల | — | 7–50 |
| 3. మిసెస్ కైలాసం | — | 5–00 |
| 4. మట్టి మనిషి | — | 14–00 |
| 5. తరస్మృతి | — | 8–00 |

రు.37–00లు M.O. చేసినవారికి పై పుస్తకములు రిజిస్టరు పోస్టులో పంపబడును.

క్రొత్త నాటకములు

| | |
|---|---|
| 1. తరస్మృతి. రా. వి. శాస్త్రి | 3–00 |
| 2. అసురసంధ్య–పాత్రో | 3–00 |
| 3. ఒక దీపంవెలిగింది. కె.విశ్వనాథం | 3–00 |
| 4. మళ్ళీ మధుమాసం. మారుతీరావు | 2–00 |

రు. 11–00లు M·O. చేసినవారికి పై పుస్తకములు రిజిష్టరుపోస్టులోపంపబడును.

ప్రతులకు :

అరుణా పబ్లిషింగ్ హౌస్

ఏలూరు రోడ్

విజయవాడ – 2

# అవసరం

ఈ పువ్వందంగా పూచింది నిజమే
కాని మనసు దానిపై లేదు.
నీ నవ్వు రోజాకన్నా బాగుంది
ఐనా అది నన్నాకట్టుకోలేదు.
వచ్చింది వసంతం కూసింది కోయి
మంచిపాట కట్టడానికిది సమయమే
ఊహూ.... ఇవన్నీ తర్వాత
మరిప్పుడేం కావాలంటావా
నువ్విస్తానంటే పది రూపాయలప్పు!
దాంతో వచ్చే బియ్యం ఉప్పు పప్పు!!
లేకుంటే పొయ్యిలో రాజుకోదు
నిప్పు!!!

—పరిగి రాధాకృష్ణ

---

ముఖాలు చదివి - ఆ స్థితిని యెదుర్కోలేక ఫెయింటై వుండాలి.

అంతలోనే చేరుకున్నాను.

పూల మొక్కలు; చెట్లు; సూర్యుడికి అడ్డుగా నిలిచిన మేడ! చల్లగా ప్రశాంతంగా వుంది వాకిలి.

వరండాలో మాధవి నిలుచుని వుంది. ప్రక్కగా, దయాసాగర్ ఐవుండాలి.

"మావయ్యా, అమ్మ ఫెయింటయినట్లుంది. యెనిమిది గంటలకికూడా తను బయటికి రాకపోతే వెళ్ళి చూశాను. వెంటనే నీకు ఫోన్ చేశాడు గుండయ్య" అంది-మాధవి కళ్ళలో నీళ్ళు.

దయాసాగర్ ఒకడుగు మా వైపు వేశాడు. అతని కళ్ళు దిగులుగానో జాలిగానో కదలాడినట్లనిపించాయి.

మాధవి వీపుమీద అభయమిస్తున్నట్లుగా తట్టి అతనితో కరస్పర్శ చేసి లోనికి నడిచాను. మెట్లమీద గుండయ్య కూర్చుని ఉన్నాడు.

గదిలోకి వెళ్ళి నాడి చూశాను. నా కాళ్లు వణికాయి. వొక్కోసారి ఆమె నాడి అంతు చిక్కకుండా పోవటం గుర్తుకొచ్చి స్తిమిత పడి అలమరా దగ్గరికి వెళ్ళాను.

వక తలుపు గాజుపలక పగిలి వుంది. బయటి నుంచి పిడికిలితోనో దేనితోనో గుద్దినట్లుగా గాజు పెంకులు లోపలికి పడివున్నాయి. నా గుండె దడదడలాడింది. పడిపోబోయి-చటుక్కున గొంతుకక్కూచున్నాను మాధవీ, దయాసాగర్లు ప్రశ్నార్థకంగా చూస్తూ నా దగ్గరికి గబగబా వొచ్చారు. నిభాయించుకుని, 'బూటులోపల రాయి ఇరుక్కుని వుండాలి! గుచ్చుకుంది' అని లేస్తూ 'చప్పుడవ కూడదు; మీరు గుమ్మంలో నిలుచోండి,' అన్నాను. వెళ్ళారు.

తాళం తీసి తలుపులు తెరిచాను. గాజు పెంకులు రెండు మూడు చిన్నవి జారి నేల మీద పడ్డాయి. స్టైతస్కోపు తియ్యబోతూండగా యెదురుగా, తెల్లని కవరు, కవరుమీద 'రవికి' అని అక్షరాలూ కనిపించాయి. కళ్ళు తిరిగినట్లై అలమరాని ఆసరా చేసుకుని, వో నిమిషం కనురెప్పలు వాల్చి- నా గుండె యెగసి నా చెవుల్లో మోగుతోంది.

ప్రక్కకి చూశాను. వాళ్ళిద్దరూ నాకేసి చూస్తున్నారు. కవరు బయటికి తియ్యకుండా అలమరాలోనే తెరిచి-

ప్రియమైన నా రవికి- పరిస్థితి పూర్తిగా అర్థమైంది. నా కళ్ళ ముందు నా బిడ్డలు అంతరించిపోవటాన్ని సహించలేను. అలా అని నేను ఆ పాపాన్ని చూస్తూ బతకలేను. నా రక్తం పంచుకుని పుట్టిన నా కుమారుణ్ని, నోరారా పిలవలేకపోగా, నా కన్నకూతురికి-కొంత పాపం చేసినదాన్ని మరి కొంత పాపం చెయ్యటానికి వెనకాడాల్సిన పనిలేదు. నిండు మనసుతో అందుకు అంగీకరించి, నా పాపానికి తగిన శిక్ష కోసం నాకై నేనే నరకానికి వెడుతున్నాను. మరో యాభై అరవై ఏళ్ళకి నిన్ను తప్పకుండా కలుసుకుంటాను. ఈ లేఖ వెంటనే చించెయ్యి. నీ అరుంధతి.

ఆ కవర్లో మరో కాగితం వుంది—నా చావుకు ఎవరూ బాధ్యులు కాదు. ఏదో అస్పష్టమైన ఆవేదన నన్ను దహిస్తూ ఒచ్చింది జీవితమంతా. జీవిత రహస్యాన్ని తెలుసుకోవాలని చేసిన నా యత్నం ఫలించలేదు. ఈ యాత్ర ముగించి అదేమిటో తెలుసుకోవాల్సిన ఒత్తిడివల్ల నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా జీవితంలో నేనెరిగిన ఏ ఒక్కవ్యక్తీ ఇందుకు బాధ్యులు కారు —అరుంధతి.

వెల్లువలా పొంగిన కన్నీటిని నిలదొక్కుకుని - కవరూ మొదటి కాగితమూ జేబులోకి దూర్చి. రెండో కాగితం చేత పుచ్చుకుని వెనక్కి తిరిగాను.

ప్రక్కమీద వెల్లకిలా పడుకుని వున్న అరుంధతి - మూర్ఛిలిన కన్నీటి ప్రవంతిలా వుంది.

తల వొంచుకుని గుమ్మం బయటికి వొచ్చాను. మాధవి, కెవ్వున కేక పెట్టి మంచం వైపు పరిగెత్తింది, తల యెత్తకుండా ఆ కాగితం దయాసాగర్కి అందించి మెల్లగా అడుగులు వేస్తూ పిట్టగోడ దగ్గరికి చేరి నేలమీదికి కూలబడ్డాను.

నా తల. కాంతివేగపు వలయ విభ్రమణంలో చితికిపోతోంది. కన్నీరు, కుష్కంగా కురిసి నన్ను ముంచెత్తుతోంది.

నేనేం చెయ్యాలిప్పుడు - మాధవీ దయాసాగర్లకి - నా అరుంధతి కూతురు మాధవి, నా కూతురులాంటి మాధవి-నాలో పితృవాత్సల్యం వెల్లువలా పొంగుతోంది - అహో, యింతటి మహత్తరానుభూతి. పవిత్రాను బంధం - యెంత శుష్కపు జీవితం, హృదయాను బంధాల లోలోతుల లో దహించలేకపోతే - యిది - యిది - మెదడు తేల్చుకోగల సమస్యకాదు....లాభంలేదు- కొన్ని తెగలలో కొన్ని రకాల అలవాట్లు కానీ యెదిగిన మానసిక స్థాయికి సహజ స్వభావమైన విలువలు వుండే వుండాలి- లేకపోతే యేవిటీ మహత్తర కాంతి పుంజం - సెంటిమెంటని కొట్టిపారెయ్యమని మెదడు చెబుతున్నా, హృదయం, హృదయంలో పొంగే రక్తం తిరస్కరిస్తోంది. నేనింతకాలం కత్తిరించి అతికించే హృదయనాళాలు, ఈ హృదయం కాదు. మేధోసౌధాలను పునాదులతోసహా నెట్టి పారేస్తుంది, అది నాతో కానిపని- నేను అంతగా అలాంటిఅభిప్రాయాలున్న నేను- నేను అది చెయ్యలేనని-జరగదు, అదెన్నటికీ జరగదు-చెప్పి వివరించి అర్థం చేసుకుని నిలదొక్కుకునేట్లు చేసి- కానీ వాళ్ళు ఆ యదార్థాన్ని యెదుర్కోలేకపోవచ్చు. అప్పుడు నా అరుంధతి చేసిన ఈ చర్యకి యేవిటి అర్థం? నేనేం చేసినట్లవుతుంది? అరుంధతీ నీ కూడా నన్నెందుకు తీసుకెళ్ళావు కాదు?

భగవాన్, నేనేం చెయ్యాలి?— ★

